క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి
– ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కర్లపాలెం సెంటర్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు రహదారులతో పాటుగ కర్లపాలెం సెంటర్‌లోని వ్యాపార కూడళ్లను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. వ్యాపరస్తులు తమ వద్ద చెత్తను ఎక్కడిపడితే అక్కడ రోడ్లపై వేయకుండా ఒకచోట ఉంచి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని ఆదేశించారు.

భట్టిప్రోలులో ప్రపంచ కవితా దినోత్సవం

భట్టిప్రోలు: ప్రపంచ కవితా దినోత్సవాన్ని శుక్రవారం భట్టిప్రోలు వాస్తవ్యురాలు కవయిత్రి దొంతు ప్రభావతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావాలను అక్షరాల్లో రమ్యంగా మలిచే కళ కవిత్వం అని తెలిపారు. కవి హృదయంలో జనియించి విశ్వమంతా వ్యాపించి తన్మయత్వం చేసే భావాలకు అక్షర రూపమే కవిత అని ఆమె పేర్కొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో శుక్రవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వెల్లటూరు, పెదపులివర్రు, పల్లెకోన, ఐలవరం, జెడ్పీ హైస్కూళ్లు, టీఎంరావు హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాల్లో ఇంగ్లీష్ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 735 మంది విద్యార్థులకు గాను 9 మంది గైర్హాజరయినట్లు ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజ్‌లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మరమ్మతులను పర్యవేక్షించిన సర్పంచ్



భట్టిప్రోలు: భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వేమవరం కాల్వకట్టపైన మోటారు మరమ్మతు పనులను సర్పంచ్ దారా రవి కిరణ్మయి యుద్ధ ప్రాతిపదికన శుక్రవారం దగ్గర ఉండి చేయించారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా కుళాయిల ద్వారా తాగునీటిని పుష్కలంగా ప్రజలకు అందించనున్నట్లు ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, తాగునీటి స్కీమ్ సిబ్బందితో మాట్లాడి మరమ్మతులకు గురైన మోటారు స్థానంలో కొత్త మోటారును ఏర్పాటు చేయించారు. పనులను సర్పంచ్ దగ్గరుండి పర్యవేక్షించారు. శనివారం ఉదయం దళితవాడ, అద్దేపల్లి, కూరగాయల మార్కెట్ ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు గమనించాలని కోరారు.

లోపాలున్న చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండండి



తెనాలిఅర్బన్: జన్యుపరమైన లోపాలతో జన్మించిన చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డైక్ సెంటర్‌లో శుక్రవారం తల్లిదండ్రులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన సమయంలో తల చిన్నగా ఉండటం, ఎదుగుదల, నడక, మాట లేకపోవడం వంటి లోపాలతో కొందరూ జన్మిస్తుంటారని చెప్పారు. అలాంటి వారికి డైక్ సెంటర్‌లో చికిత్స అందించడం జరుగుతుందన్నారు. వైద్యులు ఇచ్చిన మందులను సకాలంలో వాడటంతో పాటు వారి సూచనలను తల్లిదండ్రులు తప్పక పాటించాలన్నారు. అలా చేయడం వలన పిల్లల్లో చాలా వరకు మార్పు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డైక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు, సీనియర్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రామానుజ రావు, డైక్ సిబ్బంది పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా ప్రజావేదిక రికవరీలు

- సామాజిక తనిఖీ నివేదికలపై పెదవి విరుస్తున్న ప్రజలు
- కూటమి నేతల చెప్పు చేతల్లో తనిఖీ బృందాలు
- కోర్టు కెళ్లిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై కక్షసాధింపే లక్ష్యంగా నివేదికలు
- తనిఖీ బృందాల నివేదికలపై పలు అనుమానాలు
- కూటమి నేతలకు అనుకూలంగా ఉన్న వారికి క్లీన్‌చిట్



నగరంలో 17న జరిగిన ప్రజా వేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

నగరం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ బృందాల నివేదికలపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఉపాధి హామీ పనులు ఎలా జరిగాయి, నిధులు సక్రమంగా వినియోగించారా.. వంటి అంశాలపై నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన సామాజిక తనిఖీ బృందాలు కూటమి నేతల చెప్పు చేతల్లో నడిచారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరం మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.10 కోట్ల విలువ గల పనులు నిర్వహించారు. ఈ పనుల నిర్వహణపై ఈ నెల 1 నుంచి 16 వరకు పలు గ్రామాలలో సామాజిక తనిఖీ బృందాలు సర్వే చేపట్టి రూ.1,04,05,800 తేడాను గుర్తించారు. ఈ నివేదికలపై ఈ నెల 17వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజావేదిక నిర్వహించి రూ.47,32,009 రికవరీ చేయాలని నిర్ణయించారు. ప్రజావేదిక 17న ఉదయం 10 గంటల నుంచి 18వ తేదీ తెల్లవారుజాము 5 గంటల వరకు నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందాల తనిఖీలు, అనంతరం జరిగిన ప్రజావేదిక సభలు కూటమి నేతలు చెప్పినట్లు జరిగాయని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు.



ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు (ఫైల్‌ఫోటో)

కోర్టును ఆశ్రయించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై కక్ష సాధింపు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ బృందాల నివేదికలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలోని సిరిపూడి, పూడివాడ, చినమట్టపూడి, తోటపల్లి, ఏలేటిపాలెం, జిల్లేపల్లి, సజ్జావారిపాలెం, పెద్దవరం, ఈదుపల్లి, తాడివాకవారిపాలెం, మీసాలవారిపాలెం, అల్లపర్రు, వెనిగళ్లవారిపాలెం గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించారు. వీరిలో ఆరుగురు రిజైన్ చేయగా మిగిలిన సజ్జావారిపాలెం, వెనిగళ్లవారిపాలెం, తోటపల్లి, జిల్లేపల్లి, ఏలేటిపాలెం, చినమట్లపూడి, పూడివాడ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఇక్కడ నుంచి కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు దిగారు. కోర్టును ఆశ్రయించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై మూడు సార్లు స్పెషల్ ఎంక్వయిరీ చేశారు. కూటమి నేతలు వేధింపులకు సజ్జావారిపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ పులివర్తి వెంకటేశ్వరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. రికార్డులను ఇవ్వలేదని పోలీసు కేసు నమోదు చేయించారు. స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని కోర్టుకు వెళ్లిన వారిపై ఇటు కూటమి నేతలు, అటు అధికారులు ఒత్తిడి చేస్తున్నారని పలువురు వాపోయారు. రిజైన్ చేస్తే సామాజిక తనిఖీలో మీపై ఎటువంటి రికవరీలు లేకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారనే వాదనలూ వినిపిస్తున్నాయి.

కూటమినేతలకు అనుకూలంగా ఉన్న వారికి క్లీన్‌చిట్

సామాజిక తనిఖీ బృందాల నివేదికలపై నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తుంది. సామాజిక తనిఖీ బృందాలు రూ.1,04,05,800 తేడాను గుర్తించగా ప్రజావేదికలో అధికారులు రూ.47,32,009 రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడే కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా ఉన్న ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు రికవరీ తక్కువగా వేయించారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా మీసాలవారిపాలెంలో తనిఖీ బృందాలు రూ.5,25,997 తేడాను గుర్తిస్తే కేవలం రూ.13,651 రికవరీ చేయడం, అదేవిధంగా పెదపల్లిలో రూ.2,03,126 గుర్తిస్తే రూ.11,402, నగరంలో రూ.1,42,653 గుర్తించగా రూ.14,938, పెద్దవరంలో రూ.2,84,868 గుర్తిస్తే రూ.4,636 రికవరీ చేయాలని ఆధికారులు ఆదేశించారు. ఇదిలా ఉంటే కోర్టును ఆశ్రయించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లలో తోటపల్లిలో రూ.6,25,781 తేడాను గుర్తిస్తే రూ.5,06,476 రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

రాజకీయ నాయకుల ప్రమేయం లేదు

సామాజిక తనిఖీ నివేదికల ప్రకారమే ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రికవరీలు విధించాం. స్టేట్ రీసోర్స్ పర్సన్‌లు నిష్పక్షపాతంగా గ్రామాలలో సామాజిక తనిఖీలు చేశారు. సోషల్ ఆడిట్‌లో రాజకీయ నాయకుల ప్రమేయం, ఒత్తిడులు లేవు. లేనిపోని ఆరోపణలు సృష్టించటం సబబు కాదు. అవినీతికి పాల్పడిన వారి నుంచే రికవరీకి ఆదేశించాం. కోర్టుకు వెళ్లిన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మాత్రమే రికవరీ విధించామని ఆరోపించటం సరికాదు.

– విజయలక్ష్మి, మెప్మా పీడీ

పీ-4 సర్వేకు సహకరించాలి
మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు

రేపల్లె రూరల్: ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న పీ–4 సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు కోరారు. పట్టణంలోని ముమ్మలనేనివారిపాలెం, పీర్లపంజా, గాలి వారివీధిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న నిరుపేదలను గుర్తించి వారి ఆర్థిక స్థితిగతులను పెంపొందించేందుకు ప్రభుత్వం ఉగాది నుంచి నూతన కార్యక్రమాన్ని అమలు చేయనున్నదన్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని పేదలను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే నిమిత్తం సచివాలయ సిబ్బంది వార్డుల్లో పర్యటించిన సమయంలో ప్రజలు తమ వివరాలను తెలియజేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ ఏఈ రోహిణి, అధికారులు, గ్రామస్తులు తదితరులున్నారు.

డ్రోన్లతో నిఘా

మంగళగిరి: డ్రోన్ల సహకారంతో అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల పాఠశాల, వీజే కళాశాల, ఆత్మకూరు జంక్షన్ వద్ద డ్రోన్ల సహకారంతో ట్రాఫిక్, ప్రమాదాలను సమీక్షించారు. సీఐ మాట్లాడుతూ డ్రోన్ల సహకారంతో ఒకే చోట నుంచి పరిస్థితులను సమీక్షించి, వెంటనే అదుపులోకి తీసుకురావచ్చన్నారు. రూరల్ పరిధిలోని అసాంఘిక శక్తులు, కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, పేకాట ఆడినా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్ఐ సీహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసులురెడ్డి

కర్లపాలెం: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏపీఎం శ్రీనివాసులురెడ్డి చెప్పారు. మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలకు శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ తమ పరిధిలోని చదువురాని మహిళలను గుర్తించి వారికి చదవటం రాయటం నేర్పించాలని వీవోఏలకు సూచించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాలలోని చదువురాని మహిళలను గుర్తించి చదువుకున్న వారితో చదువు చెప్పించటం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు చదువుకున్న మహిళలకు ఈ నెల 23వ తేదీన స్థానిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరిక్షలకు హాజరయ్యే మహిళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు వారికి తీరిక సమయంలో వచ్చి పరీక్షలు రాయవచ్చన్నారు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ అధికారిక ధ్రువీకరణ పత్రాలు అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షకులు శివరామ్‌ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షులు ధనలక్ష్మి, కార్యదర్శి నాగలక్ష్మి, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఏప్రిల్ 12, 13 తేదీల్లో గ్రామ దేవత గోగులమ్మ తిరునాళ్ల



పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వ్యాఘ్నపుర క్షేత్రం పెదపులివర్రు అధిష్టాన గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 12, 13 తేదీలలో వైభవోపేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 12న తిరునాళ్ల, గ్రామోత్సవం 13న నైవేద్యములు, మొక్కుబడులు జరగనున్నాయన్నారు. గ్రామానికి చెందిన భక్తులే కాక చుట్టుపకల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలెనని వారు కోరారు.

పెదపులివర్రులో విశేష పూజలు

పెదపులివర్రులో స్వయంభువుగా కొలువైన రాజరాజ నరేంద్ర స్వామి వారికి ఎడమ, తూర్పు ముఖంగా కొలువైన శ్రీచక్ర నివాసినికి నిత్య కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి శుక్రవారం ప్రాతః కాలార్చనలో విశేష పూజలు జరిగాయి.

ముస్లిం సోదరులకు పండ్లు పంపిణీ



ముస్లిం మతపెద్దలకు పళ్లు అందజేస్తున్న మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్

కర్లపాలెం: పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందులో భాగంగా ఫ్రూట్స్ అందజేయటం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే జాకీర్ హుస్సేన్(తాజ్) చెప్పారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఇఫ్తార్ విందులో భాగంగా కర్లపాలెం మండలంలోని మసీదులకు శుక్రవారం పంపిన అరటి పండ్లు, ఖర్జూర పండ్లు, యాపిల్స్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ మసీదులలో ముస్లిం మత పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ కోన రఘుపతి పంపిన ఫ్రూట్స్‌ను కర్లపాలెంలోని నాలుగు మసీదులతో పాటు నాగరాజుపాలెం, గణపవరం, పేరలి మసీదులలో మత పెద్దలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్‌కే ఆసిఫ్ అలీ, మనోహర్, జానీ, రామరాజు తదితరులు ఉన్నారు.

క్యూలెక్స్ ఆడదోమ వల్లే బోద వ్యాధి

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి



కిట్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: క్యూలెక్స్ ఆడదోమ వలన బోద వ్యాధి వస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. బోదవ్యాధిగ్రస్తులకు శుక్రవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం వారు పంపిణీ ఫైలేరియా కిట్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోద వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు, కిట్లను పంపిణీ చేస్తుందని చెప్పారు. తెనాలి పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలకు 282 ఫైలేరియా కిట్లను అందజేయడం జరిగిందని, వాటిని సంబంధిత వైద్యాధికారులకు రోగులకు అందజేస్తారని చెప్పారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ గజ్జల్లో, చంకలో బిల్లలు కట్టి జ్వరం రావడం, కాలు చేతులు వాపులకు గురవడం, ఎర్ర చారాలు కనిపించడం వంటివి బోద వ్యాధి లక్షణాలన్ని చెప్పారు. బోధ వ్యాధితో బాధపడే వారికి ఆరు నెలలకు ఒకసారి డీఈసీ, ఆల్బెన్డ్‌జోల్ మాత్రాలు వేసుకోవాలని సూచించారు. బోద వ్యాధిగ్రస్తులు చేయాల్సిన వ్యాయామాలు స్వయం సంరక్షణ పద్ధతులను సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ తెలియజేశారు. అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బోద వ్యాధి కాళ్ళకు, చేతులకు హైడ్రోసిల్ (వరిబీజం), రొమ్ము, జ్ఞానేంద్రియాలకు సోకే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారులు శివగణేష్, వంగాల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, ఫైలేరియా అధికారులు తిరువీధుల శివరామ్‌ప్రసాద్, మున్నంగి రత్నాకరరావు, షేక్ బషీద్, బందారు మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహదారులతో ప్రజల అవస్థలు
సీపీఎం బృందం



భట్టిప్రోలు: ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం బృందం భట్టిప్రోలు మండలంలో పర్యటిస్తుంది. శుక్రవారం పెదపులివర్రు, అక్కివారిపాలెం గ్రామాలలో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ భట్టిప్రోలు–పెదపులివర్రు ఆర్ అండ్ బీ రహదారిపై లంక గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మరమ్మతులు చేయడానికి తవ్వినా కానీ పనులు జరగడం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారుల పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. అక్కివారిపాలెంలో భూగర్భ జలాలు మారిపోయి ప్రజలు తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యన్నారాయణ, గోళ్ల నాగరాజు, పి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోం సర్వేను త్వరగా పూర్తి చేయండి
మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: వర్క్‌ఫ్రమ్ హోం సర్వేను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 3వ వార్డులోని సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వర్క్ ఫ్రమ్ హోం సర్వే పురోగతిపై ఆరాతీశారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశించిన ప్రతి సర్వేను సమయానికి పూర్తి చేయాలన్నారు. ఏమైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తెవాలని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై హర్షం

తెనాలిటౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు యావత్తు మాదిగ జాతి రుణపడి ఉంటుందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చిలకా కిరణ్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్దఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సాపాటి కిరణ్, కోపల్లె శ్రీను, పినపాటి రత్నాకర్, సురేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులు తప్పనిసరిగా నామినీని ఏర్పరచుకోవాలి

యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగలక్ష్మి



బ్యాంక్ లావాదేవీల బుక్ లెట్‌లను ప్రదర్శిస్తున్న వివిధ బ్యాంక్‌ల మేనేజర్‌లు

రేపల్లె రూరల్: బ్యాంక్ ఖాతాదారులు తప్పనిసరిగా తమ అకౌంట్‌లకు నామినీలను ఏర్పరచుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ నాగలక్ష్మి తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతపై భారతీయ రిజర్వు బ్యాంక్, అవార్డు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. బ్యాంక్ ఖాతాలను సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. 10 సంవత్సరాలపాటు బ్యాంక్ ఖాతాకు లావాదేవీలు జరగని పక్షంలో ఆ ఖాతాలోని నగదు రిజర్వు బ్యాంక్‌కు చేరుతుందన్నారు. బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీతో పాటు సిబిల్ స్కోర్ పెరుగుతుందన్నారు. దీని ద్వారా బ్యాంకుల నుంచి మరిన్ని రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఖాతాదారు కేంద్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలలో సభ్యులుగా చేరాలన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో తెలపరాదన్నారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకునేందుకు తప్పనిసరిగా బ్యాంకులను సంప్రదించాలన్నారు. బ్యాంక్ లావాదేవీల బుక్‌లెట్ వివరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రభుకిరణ్, ఇసుకపల్లి స్టేట్ బ్యాంక్ మేనేజర్ రాము, చైతన్య గోదావరి బ్యాంక్ మేనేజర్ రమేష్‌రెడ్డి, డీఆర్‌డీఏ సీసీ పూర్ణచంద్, రీసోర్స్ పర్సన్ జానకిరామ్, అవార్డు సంస్థ ప్రతినిధులు జయరామ్, పీటర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ఎంపీహెచ్ఎస్ సూపర్‌వైజర్ చక్రధర్

నిజాంపట్నం: విద్యార్థి దశ నుంచే వ్యాధులు, ముఖ్యంగా క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మల్టీ పర్పస్ హెల్త్ (ఎంపీహెచ్ఎస్) సూపర్‌వైజర్ గళ్ళా చక్రధర్ అన్నారు. క్షయవ్యాధిపై మండలంలోని ప్రజ్ఞం హైస్కూలులో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రెండు వారాల కుపైగా దగ్గు రావటం, జ్వరం, బరువు తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. వైద్యుని పర్యవేక్షణలో ఆరు నెలల పాటు వైద్యం పొంది వ్యాధి నుంచి పూర్తిగా ఉపశమనం పొందవచ్చన్నారు. రోగికి ఉచితంగా వైద్య పరీక్షలతోపాటు మందులు అందించబడునన్నారు. అంతే కాకుండా నెలకు ప్రభుత్వం రోగికి రూ.1,000 అందిస్తుందన్నారు. ఆయా లక్షణాలు ఎవరిలోనైనా కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్సలు పొందేలా రోగులను విద్యార్థులు చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మురళి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతకు, మన్నికకు భారతి సిమెంట్



మేస్త్రీకి బీమా బాండ్ అందజేస్తున్న రాజశేఖరరెడ్డి, సురేష్, భవానీశంకర్

తెనాలిరూరల్: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంటు ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్.భవానీశంకర్ సూచించారు. పట్టణ లోయర్ వార్ఫ్ రోడ్డులోని సత్యదేవ ట్రేడర్స్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు శుక్రవారం రాత్రి నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని, కట్టడాలు నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందన్నారు. సిమెంటు తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని తెలిపారు. భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించి వేసిన శ్లాబులను 7 రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలను చేస్తారని చెప్పారు. ఇందుకు సంబంధిత డీలరు ద్వారా తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. సత్యదేవ ట్రేడర్స్ యజమాని జి. రాజశేఖర రెడ్డి, ఇతర డీలర్లు, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కరపత్రాలు అందజేస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా, అధికారులు

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్కరు తాము నివాసముంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో శుక్రవారం నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్తను ఊడ్చి శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఎంటీఎంసీ అదనపు కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎంటీఎంసీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.